

## 4న ఆర్థిక కార్యాలయాల సముదాయం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని కలెక్టర్ కార్యాలయ సమీపంలో కొత్తగా నిర్మించిన ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యాలయాల సముదాయాన్ని (ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్) రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఆర్థిక, ప్రణాళిక,వాణిజ్య, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కలసి ఈనెల 4న ప్రారంభించనున్నట్లు జిల్లా ఖజానా లెక్కల అధికారి ఆర్ఎఎస్ కుమార్ తెలిపారు. ఆరోజు ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అధ్యక్షత వహిస్తారని, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు. రూ.14.30 కోట్ల వ్యయంతో మూడు అంతస్థుల్లో నిర్మించిన ఈ భవన సముదాయంలో జిల్లా ఖజానా అధికారి కార్యాలయంతో పాటు, పే అండ్ అకౌంట్స్ కార్యాలయం, ఏ.పి.ప్రభుత్వ బీమా కార్యాలయం, జిల్లా ఆడిట్ అధికారి(స్టేట్ ఆడిట్) కార్యాలయం ఏర్పాటు చేస్తామని తెఇలపారు.

# గజరాజుల బీభత్సం

- సంగాంలో మూడు ఆవులపై దాడి
- ఒకటి మృతి, రెండింటికి తీవ్ర గాయాలు
- పంట పొలాలు నాశనం
- మగ్గూరులో అర్ధరాత్రి వీధిలోకి వచ్చిన ఏనుగు

ప్రజాశక్తి - వంగర

మండలంలోకి ప్రవేశించిన గజరాజులు గుంపు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. వివిధ గ్రామాలలో సంచరించి చెరకు, వరి, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేయడంతో పాటు పశువులపై దాడి చేసి బీభత్సం సృష్టిస్తున్నాయి. శ్రీహరిపురంలో ప్రవేశించిన ఏనుగులు భాగంపేట చేరుకొని గ్రామానికి చెందిన ఓ కుటుంబం తిండి గింజలను ధ్వంసం చేశాయి. అక్కడ నుంచి నీలయ్యవలస, జగన్నాథవలస, మడ్డువలస గ్రామ పొలాల్లో సంచరించి పంటలను ధ్వంసం చేశాయి. సంగాం చేరుకుని వరి, మొక్కజొన్న, జీడి పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఏనుగులు దాడిలో ఆవు మృతి**

సంగాం గ్రామానికి చెందిన బొడ్రోతు రామినాయుడు పాడి ఆవుపై మంగళవారం అర్ధరాత్రి ఏనుగులు గుంపుగా వచ్చి దాడి చేయడంతో ఆవు మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన వావిలపల్లి జగన్నాథం నాయుడు, ఆలుబిల్లి ఈశ్వరరావులకు చెందిన ఆవులపై ఏనుగులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాయి. తమ పాడి ఆవు మృతి చెందిందని రామి నాయుడు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా వినిపిస్తున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ విషయంపై తహశీల్దార్ డి ఐజాక్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఏనుగులు దాడిలో మృతి చెందిన ఆవుకు వంగర ఇంచార్జి పశువైద్యాధికారి వేగిరెడ్డి రాము పోస్టుమార్టం నిర్వహించారు. నివేదికను ఫారెస్ట్ అధికారులకు పంపిస్తామని తెలిపారు.

**మగ్గూరులో ఓ ఇంటి తలుపు తట్టిన ఏనుగు**

సంగాంలో బీభత్సం సృష్టించిన ఏనుగులు గుంపు అక్కడ నుంచి దగ్గరలో ఉన్న మగ్గూరు గ్రామానికి అర్ధరాత్రి చేరుకున్నాయి. అందులో ఓ ఏనుగు గ్రామ శివారులో ఉన్న మారడాన శ్రీనుకు చెందిన ఇంటి తలుపును పెద్ద ఘీంకార శబ్దం చేసి తట్టడంతో భయభ్రాంతులకు గురై ఆ ఇంట్లో ఉన్న వారంతా బయటకు పరుగులు తీసి కేకలు వేశారు. ఇంటి పక్కనే తన శాలలో ఉన్న ఆవుపై ఏనుగు దాడి చేసిందని శ్రీను తెలిపారు. మగ్గూరులో బుధవారం సాయంత్రం వరకు సంచరించిన ఏనుగుల గుంపు అక్కడ నుంచి మండలంలోని ఓని అగ్రహారం పొలాల్లోకి చేరుకున్నాయి.

**భయాందోళన చెందుతున్న ప్రజలు**

పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు వీధుల్లోకి చొరబడి పశువులపై దాడి చేయడంతో పాటు తలుపులు తడుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రధానంగా ప్రస్తుతం వరి పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఇలాంటప్పుడు ఏనుగులు పొలాల్లో



ఏనుగుల దాడిలో మృతి చెందిన ఆవు



పంట పొలాలల్లో తిరుగుతున్న ఏనుగులు

సంచరిస్తుండటంతో పొలాలకు వెళ్లాలంటే రైతులు భయపడుతున్నారు. రహదారుల పైన కూడా రాకపోకలకు ఆటంకం కల్పిస్తున్న ఏనుగులను ఇక్కడ నుంచి పంపించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**అప్రమత్తం చేస్తున్న అధికారులు**

ఏనుగుల వద్దకు ప్రజలు ఎవరూ కూడా వెళ్లకుండా తహశీల్దార్ డి.ఐజాక్, ఎస్ఐ ఆర్ జనార్ధన్‌రావు గ్రామాలలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఏనుగులు కదిలికిన ఎలిఫెంట్ మానిటరింగ్ యూనిట్ అధికారి (ఈఎంసి) మణికంఠ, విజయనగరం ఫారెస్ట్ రేంజ్ అధికారి బి. అప్పలరాజు, బీట్ అధికారులు స్వప్న, రిషికేశ్, సత్యనారాయణ, మొత్తం 18 మంది ట్రాకర్స్, అటవీ శాఖ సిబ్బంది పరిశీలిస్తున్నారు. ఏనుగుల వైపు ప్రజలు ఎవరూ వెళ్లి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని ప్రజలకు తెలియజేస్తున్నారు.

**విద్యుత్ సరఫరా నిలిపివేత**

సంగాం, మగ్గూరు గ్రామాలలో ఏనుగులు సంచరించడంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఆయా గ్రామాలకు విద్యుత్ శాఖ ఏఈ వినయ్ కుమార్ బుధవారం కొంత సమయం విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆయా గ్రామాల నుంచి ఏనుగులు కదలడంతో మరల విద్యుత్ పునరుద్ధరించారు.



కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న గురజాడ విజ్ఞాన వేదిక సభ్యులు, పలు ప్రజాసంఘాల నాయకులు

# మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

## గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని పలువురు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనలకు నిరసనగా, మహిళలపై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన బుధవారం సాయంత్రం నగరంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్ల వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జివికె కన్వీనర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు నెలలుగా మణిపూర్‌లో ఘర్షణలు జరుగుతున్నా బిజెపి ప్రభుత్వం స్పందించక పోవడం అన్యాయమన్నారు. మత ఘర్షణలను రెచ్చగొట్టి మహిళలు, పిల్లలు లక్ష్యంగా దాడులు చేయడం దుర్మార్గమన్నారు. హింసను ప్రేరేపించే విధంగా మోడీ ప్రభుత్వం వ్యాహరించడం దారుణమన్నారు. వెంటనే మణిపూర్ లో మారణ హోమాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుకారి బాబు, జెవివి నాయకులు ఎంవిఎన్ వెంకటరావు, రమణ ప్రభాత్, వి.రాజ్‌గోపాల్, మెడికల్ రిప్రెజెంటేటివ్ యూనియన్ నాయకులు యుఎస్ రవికుమార్, శశిధర్, రాజశేఖర్, ఇన్సూరెన్స్ యూనియన్ నాయకులు ఎం.శ్రీనివాస, ప్రజా సంఘాలు నాయకులు పి.వెంకటరమణ, డివైఎఫ్ఐ నాయకులు సతీష్, హరీష్, విద్యార్థులు, మైనార్టీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

**విద్యుత్తు ఉద్యోగుల జెఎసి చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ • విద్యుత్తు భవనం వద్ద నిరాహార దీక్షలు ప్రారంభం**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆగస్ట్ 10 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని విద్యుత్తు ఉద్యోగుల జెఎసి చైర్మన్ డి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. రాష్ట్ర జెఎసి పిలుపులో భాగంగా బుధవారం నుంచి దాసన్న పేట విద్యుత్ భవనం వద్ద రిలే నిరాహారదీక్షలు ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని సార్లు ప్రభుత్వాన్ని సమస్యలు పరిష్కరించాలని కోరినా నేటి వరకు అతీగతీ లేదన్నారు. ఉద్యోగులకు 45శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి ఇవ్వాలని, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు , ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, జెఎల్ఎం గ్రేడ్-2 ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొహిబిషన్ డిక్లేర్ చేయాలని, చనిపోయిన జెఎల్ఎం గ్రేడ్ -2 ఎనర్జీ అసిస్టెంట్స్ కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఇపిఎఫ్ అమలు అవుతున్న విద్యుత్ ఉద్యోగులందరికీ జిపిఎఫ్‌లోకి మార్చాలని,కారుణ్య నియామకాలలో అడ్డగోలు నిబంధనలు పెట్టకుండా నియామకాలు చేపట్టాలని, పీస్ రేటు కార్మికులకు





రిలే నిరాహార దీక్ష చేస్తున్న విద్యుత్తు ఉద్యోగులు

ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

దీక్షలోరెడ్డి తిరుపతిరావు,మీసాల రమేష్, వివి రమణ,పి ఆర్‌కె బాలాజీ, టి.అచన్న, బి.రాజేష్ కుమార్, ఎన్. ఏసుబాబు, జి.రమణ, కె.సన్యాసి నాయుడు, జి.లక్ష్మణరావు, ఎస్.తాతి నాయుడు, పి.హరిప్రసాద్ దీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బి.రోజాకుమర్ కన్వీనర్, పి. త్రినాథ్ రావు, సీతారామ, డిప్లొమా ఇంజినీర్స్, డిస్కం ఇంజినీరింగ్ అసోసియేషన్ నాయకులు,ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు,విద్యుత్ ఉద్యోగుల పాల్గొన్నారు.

# తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉండాలి

**జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు**

**గర్భిణులు, బాలింతలకు రేషన్ పంపిణీ**

ప్రజాశక్తి-విజయనగరం

తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉండాలని, భవిష్యత్ తరాలు శక్తివంతంగా మారాలన్న గొప్ప లక్ష్యంతో, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గర్భిణులు, బాలింతల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమానికి జెడ్‌పి చైర్మన్ కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం శ్రీకారం చుట్టారు. ఐసిడిఎస్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో, ఒక్కొక్కరికీ సుమారు రూ.1010 విలువైన పోషకాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని చెప్పారు. దీనిలో భాగంగానే ఇంటికి తీసుకువెళ్లేందుకు వీలుగా పోషక పదార్థాల కిట్లను రూపొందించి అందజేస్తోందని చెప్పారు. గర్భం దాల్చిన దగ్గరనుంచీ, వారి ఆరోగ్యం పట్ల నిత్యం పర్యవేక్షణ ఉంచాలని మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులకు సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని, వారికి ఎటువంటి లోటు రాకుండా చూడాలని కోరారు. బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తప్పనిసరి అయితే తప్ప సిజేరియన్ల జోలికి పోకుండా, వీలైనంత వరకు బిడ్డను సహజసిద్ధంగా కనడం ఎంతో శ్రేయస్కరమని పేర్కొన్నారు. ఎంఎల్‌సి డాక్టర్ పి.సురేష్‌బాబు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు జి.ఉమ, బాలల హక్కుల కమిషన్ జిల్లా ఛైర్‌పర్సన్ హిమబిందు, డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, జిల్లా పరిషత్ మహిళా సంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్మన్ శాంతకుమారి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ఎం.లయా యాదవ్ మాట్లాడారు. మహిళలు గర్భిణిగా ఉన్నప్పుడు, బిడ్డకు పాలిచ్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా, తల్లిపాల విశిష్టతను వివరించారు. సామూహిక సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిఆర్ఓ ఎం.గణపతిరావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారతాధికారిణి బి.శాంతకుమారి, ఐసిడిఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణులకు రేషన్ పంపిణీ చేస్తున్న జెసి, జెడ్‌పి చైర్మన్

# ఒపిఎస్ కోసం ఉద్యమిస్తాం

**21,22 తేదీల్లో రాష్ట్ర మహాసభలు : ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిపిఎస్‌ను ఆహ్వానిస్తునే ఒపిఎస్ కోసం ఉద్యమిస్తామని ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 21,22 తేదీల్లో విజయవాడలోని ఇందిరగాంధీ స్టేడియంలో జరిగే 21వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఉద్యోగులను కోరారు. బుధవారం స్థానిక ఎన్‌జిఒ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలకు ముఖ్యమంత్రి, సబ్ కమిటీ సభ్యులు బొత్స సత్యనారాయణ, సజ్జల రామకృష్ణారెడ్డి, జోగి రమేష్, బుగ్గన రాజేంద్రప్రసాద్, చీఫ్ సెక్రెటరీ జవహర్ రెడ్డి, పోలా భాస్కర్ హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ఇవ్వడంలో జాప్యం చేస్తోందన్నారు. ఇటీవల చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు మట్టిఖర్చు కూడా ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. అయితే కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు. వైద్య విధాన పరిషత్ లో కార్పొరేషన్ ఉద్యోగులకు 010 ద్వారా వేతనాలు ఇవ్వడం మంచిదేనని అన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సచివాలయం ఉద్యోగాలకు జూనియర్ అసిస్టెంట్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి వి రమణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.మురళి, సురేష్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.





# ఫెర్రో ఎల్లాయీస్ వర్కర్స్ రాష్ట్ర కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలను రక్షించాలని, కార్మికుల ఉపాధిని కాపాడాలని డిమాండ్‌చేస్తూ మంగళవారంజరిగిన రాష్ట్రసదస్సులో రాష్ట్ర ఫెర్రో ఎల్లాయీస్ వర్కర్స్ కో ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు అయ్యింది. కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా టి వి రమణ, కో కన్వీనర్‌గా ఆర్.రాముతో పాటు 16 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటైంది. నేడు రాష్ట్రం లో 38 ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలపై ప్రత్యక్షంగా 60 వేల మంది కార్మికులు, పరోక్షంగా 5 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. ఫెర్రో పరిశ్రమలు నిరంతరం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. కానీ నేడు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీల వలన యాజమాన్యాలు పరిశ్రమలను మూసివేయటం లేదా ఉత్పత్తి ని తగ్గించేయటం చేస్తున్నాయి. ఫలితంగా వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. నేపథ్యంలో లిఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమను రక్షించాలని...కార్మికుల ఉపాధిని కాపాడాలి అనే డిమాండ్‌తో రాష్ట్రసదస్సు నిర్వహించామని టివి రమణ తెలిపారు. రానున్న కాలంలో ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమ రక్షణకు, కార్మికుల ఉపాధిని కాపాడటానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని టివి రమణ తెలిపారు.

## నగరాభివృద్ధికి అవకాశం కల్పించాలి : మేయర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర అభివృద్ధికి మరో అవకాశం కల్పించాలని మేయర్ విజయలక్ష్మి ప్రజలను కోరారు. నగరంలోని 11వ డివిజన్ రామకృష్ణ పాఠశాల నుండి ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మేయర్ తో పాటు జోనల్ ఇన్చార్జి కోలగట్ల కష్ణారావు పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ లబ్ధిదారులకు బుక్లెట్లను అందజేశారు. స్థానిక సమస్యల పైన ఆరా తీశారు. సహాయ కమిషనర్ ప్రసాదరావు, వెసిపి నాయకులు గుజ్జల నారాయణరావు, వెంపడాపు శ్రీనివాసరావు, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

**వైసిపి నాయకుడి వేధింపులతో**

# మహిళా వాలంటీర్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో కౌన్సిలర్ భర్త వేధింపులు తాళలేక మహిళా వాలంటీర్ గొల్లపల్లి విజయలక్ష్మి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బుధవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసుకోవడంతో కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ సందర్భంగా వాలంటీర్ విజయలక్ష్మి మాట్లాడుతూ 31వ వార్డులో పనిచేస్తున్న తనను కౌన్సిలర్ చోడిగంజి అనసూయమ్మ భర్త రాజగోపాల్ ఎప్పటికప్పుడు వేధించడంతో పాటు వాలంటీర్ బాధ్యతల నుంచి పూర్తిగా తొలగిస్తామని బెదిరిస్తున్నారని తెలిపింది. రేషన్ బియ్యం పంపిణీ చేసే ఎండియు ఆపరేటర్ జాగాన శశికాంత్‌కు వాహనమిత్రకు ఆన్‌లైన్ చేశామని, ఈ విషయం తనకు చెప్పకుండా నిన్ను ఎవరు ఆన్‌లైన్ చేయమన్నారంటూ అడగడంతో పాటు తనకు చెప్పకుండా ఏపని చేయకూడదని హుకుం జారీ చేశారని వాపోయింది. అంతేకాకుండా ఆమె సచివాలయానికి వెళ్తే బయట తిరిగి వస్తున్నానని నిందలు వేసి వాలంటీర్ నుంచి తీసివేస్తామని బెదిరించడంతో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడినటు తెలిపింది. తనను వేధించిన రాజగోపాల్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. పోలీసులు కేసు నమోదు చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాలంటీర్‌ను టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి బేబినాయన, జనసేన నాయకులు పరామర్శించారు.



వాలంటీర్ విజయలక్ష్మి

## విద్యా సంస్థల్లో హిందూ మత ప్రచారాలా?

**ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యాసంస్థల్లో హిందూ మత ప్రచారం నిర్వహిస్తామని దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పడాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) విజయనగరం జిల్లా కమిటీ ఖండించింది. ఈమేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ ఒక ప్రకటన విడుదల చేశారు. మనది లౌకిక రాజ్యాంగంతో నిర్మించబడిన భారతదేశమని, ఇలాంటి దేశంలో ప్రభుత్వాలు ఒక మతానికి కొమ్ముకాస్తామని నిర్భయంగా, నిర్లజ్జగా బహిరంగంగా చెప్పడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. స్వాతంత్రం వచ్చిన దగ్గర నుంచి కుల ,మత ,జాతి, లింగ బేధాలు లేకుండా ఒక్కటిగా ఉన్న ఈ భారత దేశంలో మతాల మధ్య చిచ్చులు పెట్టడమే లక్ష్యంగా ఈ ప్రభుత్వం విద్యాసంస్థల్లో మత ప్రచారాన్ని నిర్వహిస్తామని ప్రకటించడం రాజ్యాంగం రాసిన అంబేద్కర్ ని అవమానించడమేనని అన్నారు. ఇప్పటికే దేశంలో బిజెపి వివిధ రాష్ట్రాల్లో చేస్తున్న మత కల్లోలాల వల్ల మణిపూర్ , హర్యానా వంటి రాష్ట్రాలలో ఎంతోమంది అల్లర్లలో ప్రాణాలు కోల్పోతున్నారని , ఇటువంటివి చూసి కూడా ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా హిందూ ధర్మ ప్రచారం విద్యాసంస్థల్లో చేస్తామని చెప్పడం సమంజసం కాదని అన్నారు. తక్షణమే ఇటువంటి ప్రచారాలను మానేసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాని, పాఠశాలల విలీనాలని ఆపి విద్యార్థులకు చదువును దగ్గర చేయాలని , ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా ఓట్ల కోసం , సీట్ల కోసం హిందూ ధర్మ ప్రచారాలు అని విద్యార్థుల వద్దకు వస్తే విద్యార్థుల తిరుగుబాటును ఈ రాష్ట్ర ప్రభుత్వం చవి చూస్తుందని హెచ్చరించారు. భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

# విద్యార్థులతో మమేకమవుతూ.. సమస్యలు తెలుసుకుంటూ..

**3వ రోజుకు ఎస్ఎఫ్ఐ సైకిల్‌యాత్ర**

ప్రజాశక్తి-గంట్యాడ, గజపతినగరం

విద్యార్థులతో మమేకమవుతూ.. సమస్యలు తెలుసుకుంటూ ఎస్ఎఫ్ఐ నాయకుల సైకిల్‌యాత్ర ఉత్సాహంగా ముందుకు సాగుతోంది. సంక్షేమ వసతి గృహాలను పరిశీలిస్తూ విద్యార్థులను బాగోగులు అడిగి తెలుసుకుంటున్నారు. . జిల్లాలో విద్యారంగం అభివృద్ధికై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన చేపట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర మూడోరోజు గంట్యాడ మండల కేంద్రంలోని శ్రీనిధి కళాశాల వద్ద ప్రారంభమైంది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ ప్రారంభించారు. అనంతరం లక్కిడాం జంక్షన్‌లో జిల్లా కమిటీ సభ్యులు సోమేష్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులకు చాలీ చాలని భోజనం పెడుతున్నారని,పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచి, వారి ఆకలి తీర్చాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ డిగ్రీలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ విధానాన్ని విద్యార్థుల స్థాయికి, సిలబస్‌కు అనుగుణంగా పెట్టాలని డిమాండ్ చేసారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సమీరా మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కె.రవికుమార్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.అనసూయమ్మ, సిఐటియు నాయకులు వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు స్థానికజెడ్‌పి హైస్కూలును, బుడతనాపల్లి హైస్కూలును సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వీరికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జెఆర్‌సి పట్నాయిక్ స్వాగతం పలికారు.

**గజపతినగరంలో ఘన స్వాగతం**

గంట్యాడ నుంచి ప్రారంభమైన సైకిల్‌యాత్ర బొండపల్లి మండలం దేవుపల్లి మీదుగా గజపతినగరం చేరుకుంది. దేవుపల్లి హైస్కూలులో విద్యార్థులతో మాట్లాడేందుకు హెచ్ఎం రమణమూర్తి అనుమతి ఇవ్వలేదు. అయినా నాయకులు అక్కడి అధ్వానంగా ఉన్న బాత్‌రూమ్‌లను, కిచెన్‌షెడ్‌లను పరిశీలించారు. అనంతరం గజపతినగరం చేరుకున్న సైకిల్ యాత్రకు స్టేట్‌బ్యాంకు సమీపాన ఘన స్వాగతం పలికారు. విద్యారంగ సమస్యలపై స్వాగతం పలికిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్, ఐద్వా నాయకులు వి.లక్ష్మి, తదితరులు ఉన్నారు.



ఎస్ఎఫ్ఐ నాయకులకు హారతినిస్తున్న విద్యార్థులు

## షెడ్యూల్ ప్రకారం ఇంటింటి సర్వే : డిఆర్ఒ

ప్రజాశక్తి-విజయనగరం

ఇంటింటి సర్వే వేగంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు కోరారు. బిఎల్ఒలను, బిఎల్ఎలను సమన్వయం చేసి నిర్ణీత షెడ్యూల్ ప్రకటించి, దాని ప్రకారమే ఇంటింటి సర్వే జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అవగాహన లేనివారికి మరోసారి శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం సమావేశం జరిగింది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఇంటింటి సర్వే తీరును పార్టీల ప్రతినిధులు వివరించారు. నిర్ధేశిత సమయం లేకపోవడం వల్ల, బిఎల్ఒలు, బిఎల్ఎల మధ్య సమన్వయం కొరవడిందని చెప్పారు. తరచూ యాప్‌లో లోపాలు తలెత్తుతున్నాయని అన్నారు. వీలైనంత వరకు ఉదయం 8 గంటలు నుంచి 11 గంటలు మధ్య ఇంటింటి సర్వే నిర్వహించాలని, షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటించాలని కోరారు. బిఎల్ఒలకు ఇతర పనులనుంచి మినహాయింపు ఇస్తే, సర్వే వేగంగా జరుగుతుందని సూచించారు. సమావేశంలో ఇఆర్ఒలు సూర్యనారాయణ, పద్మలత, అప్పారావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ దేవ్ ప్రసాద్, ఎన్నికల డిటిలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చెత్త వర్గీకరణకు చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని గృహ సముదాయాల నుండి సేకరిస్తున్న చెత్త వర్గీకరణ దిశగా చర్యలు చేపట్టాలని పారిశుధ్య సిబ్బందికి, చెత్త తరలించే వాహన కార్మికులకు, పర్యవేక్షకులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్. శ్రీ రాములునాయుడు ఆదేశించారు. మంగళవారం ఉదయం రింగ్ రోడ్ లో ఉన్న ట్రాన్సిట్ స్టేషన్ కు చేరుకుని పారిశుధ్య విధానాన్ని పరిశీలించారు. ట్రాన్సిట్ స్టేషన్ నిర్మాణ పనులను గమనించారు. చెత్త తరలించే వాహనాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న చెత్తతో వచ్చిన వాహనాల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా క్లీన్ ఆంధ్రప్రదేశ్ క్లాప్ కార్యక్రమం విజయవంతానికి సిబ్బంది, కార్మికులు కృషి చేయాలని అన్నారు. ప్రజలు కూడా సకాలంలో క్లాప్ యూజర్ చార్జీలను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు అంజిబాబు, కాంట్రాక్టర్ మత్స సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే తండ్రికి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స

**శృంగవరపుకోట:** ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తండ్రి రాములునాయుడు (85) అనారోగ్య సమస్యలతో బాధపడుతుండంతో ఆయన్ను స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి తండ్రి అనారోగ్యానికి గురైనా ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించకుండా ప్రభుత్వాస్పత్రిలో చేర్పించి స్ఫూర్తిగా నిలిచారని పలువురు చర్చించుకుంటున్నారు. కాగా ఆయన తండ్రి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్న విషయం తెలుసుకున్న వెంటనే జిసిసి రాష్ట్ర చైర్పర్సన్ శోభ స్వాతిరాణి, మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, డిసిసిబి చైర్మన్ వేచలపు చినరామునాయుడు, సాంస్కృతిక శాఖ రాష్ట్ర డైరెక్టర్ వాకాడ రాంబాబు తదితరులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వ వైద్యం బలోపేతమైందన్నారు. ఎస్.కోట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేసి అత్యాధునిక వసతులు, 22మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించిందన్నారు. ఈ నేపథ్యంలోనే తన తండ్రిని కూడా ఈ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నామన్నారు.

## నేడు 'అన్న కేంటీన్' ప్రారంభం

**శృంగవరపుకోట:** ఎస్.కోట తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఉదయం 10 గంటలకు టిడిపి విశాఖ పార్లమెంటరీ ఇంచార్జ్ మతుకుమిల్లి భరత్ చేతుల మీదుగా అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తామని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో వారు బుధవారం మాట్లాడుతూ తమ సొంత నిధులతో మాజీ మంత్రి కోళ్ల అప్పలనాయుడు జ్ఞాపకార్థం ఆయన సతీమణి కోళ్ల పైడితల్లి ఆశీస్సులతో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలో గల నాయకులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు : ఎమ్మెల్యే

**బాడంగి:** ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువచేయడంతో పాటు, ప్రభుత్వ పాలనను ప్రజల ఇంటిముందుకే తీసుకువెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గొల్లాదిలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ సెంటర్లను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో మాదిరిగా మండల కేంద్రాలకు తిరిగే పనిలేకుండా తమ గ్రామంలోనే ప్రభుత్వం అందించే అనేక రకాల సేవలు వినియోగించుకునేలా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోగి గౌరి, జెడ్పిటిసి పెద్దింటి రామారావు, డిఇ అప్పారావు, వైసిపి నాయకులు మరిపి శంకర్‌రావు, సర్పంచులు, ఎంపిటిసిలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బేబినాయన పరామర్శ

**బాడంగి:** విద్యుత్ ఘాతానికి గురై మరణించిన ఇద్దరు రైతు కుటుంబాలను, గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతును స్థానిక సిహెచ్‌సికి వెళ్లి టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన బుధవారం పరామర్శించారు. క్షతగాత్రుడు వెంపటపు రాములను పరామర్శించి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మార్చురీలో ఉన్న రైతులు అప్పలనాయుడు, రామ్మూర్తి మృతదేహాలను త్వరగా పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించాలని వైద్యులకు సూచించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. టిడిపి తరఫున సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట టిడిపి నాయకులు తెంటు రవి బాబు, పాలవలస గౌరు, సింగిరెడ్డి భాస్కర్ రావు, ఎగిరెడ్డి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : ఎమ్మెల్యే

**బొబ్బిలి:** పట్టణం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. బొబ్బిలి పురపాలక సంఘం 30వ వార్డు పాకీ వీధిలో సుమారు రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించబోయే సిసి రోడ్లు, కల్వర్టులు నిర్మాణానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, బుడా ప్రతినిది ఇంటి గోపాలరావు, 30వ వార్డు కౌన్సిలర్ వాడపల్లి వనజకుమారి, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు పరిశీలనలో పాల్గొనాల్సిందే

**డెంకాడ:** గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ పరిశీలన కార్యక్రమంలో టిడిపి తరుపున ఉన్న బిఎల్ఒలు, నాయకులు పాల్గొనాల్సిందేనని మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇంఛార్జిలు, ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఓటర్ల సర్వే కార్యక్రమం ఎలా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు, నాయకులు కాగితాల సత్యనారాయణ రెడ్డి, పతివాడ శివరామ విద్య సాగర్ నాయుడు, కలిదిండి రంగరాజు, చీకటి సుహాసిని, బొండా రవి, నాగవంశపు కన్వీనర్ ముణి పైడయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

**కొత్తవలస:** పాత సుంకరపాలెంలో స్కూల్ బిల్డింగ్ నిర్మాణానికి శారద మెటల్స్ కంపెనీ ముందుకు రావడం అభినందనీయమని ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అన్నారు. బుధవారం పాత సుంకరపాలెంలో స్కూల్ బిల్డింగ్ నిర్మానానికి శారదా మెటల్స్ సీనియర్ జిఎం కె.విజయభాస్కర్ భూమి పూజ చేశారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ ఇప్పటి వరకు విద్యార్థులకు ప్రైవేటు భవనంలో తరగతులు నిర్వహించే వారిని శారద కంపెనీ అన్ని వసతులతో స్కూల్ బిల్డింగ్ నిర్మాణానికి ముందుకు రావడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, మాజీ ఎంపిపి గొరపల్లి శివ, ఎంపిటిసి లక్ష్మి, పి. సూరిబాబు, శారద యజమాన్య ప్రతినిధులు హెచ్. సన్యాసిరావు, హెచ్. పద్మాకరరావు, జి. శంకరరావు కె. సంతోష్ కుమార్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ ఆకస్మిక తనిఖీలు

**బొబ్బిలిరూరల్ :** తహశీల్దార్ డి. రాజేశ్వర్రావు బుధవారం కోమటిపల్లి, కలవరాయి, పక్కి గ్రామాల్లో పర్యటించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కోమటిపల్లి పెట్రోల్ బంకులో కల్తీ, తూనికల్లో తేడాలను, కాలవరాయి జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాన్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్లో కల్తీ జరిగినా, కొలతల్లో తేడాలున్నా చర్యలు తప్పవన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టిక ఆహారం వేడి వేడిగా ఇవ్వాలని సూచించారు. పక్కి గ్రామంలో ఓటర్ల పరిశీలనలో ఎమ్మెల్యే ఇంటి వద్ద జరుగుతుండగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి సాయికృష్ణ పాల్గొన్నారు.

## కరకవలసలో గడపగడపకు మన ప్రభుత్వం

**వేపాడ:** మండలంలోని జాకేరు సచివాలయం పరిధిలోని కరకవలస గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వేచలపు చిన రాము నాయుడు, ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, జెడ్పిటిసి సేనాపతి అప్పల నాయుడు, జెసిఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు నిరుజ్యోగి వెంకటరావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, స్థానిక సర్పంచ్ పెంటమ్మ, దుల్ల అప్పన్న, అర్జున రావు, చిన్నం నాయుడు, సింహాచలం నాయుడు, బీలా సతీష్, ఎంపిటిసిలు, సర్పంచులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులను గుర్తించండి : ఎడి

**బొబ్బిలిరూరల్:** మండలంలో కౌలు రైతులను గుర్తుంచాలని వ్యవసాయ శాఖ ఇంచార్జి ఏడి యం. శ్యాంసుందర్ అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన విఆర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు రైతులకు ఇవ్వాల్సిన రాయితీలు పొందాలంటే పారదర్శికంగా గుర్తుంపు కార్యక్రమం జరగాలన్నారు. మండలంలో ఐదు రోజుల్లో 2,210 మంది రైతులను గుర్తుంచాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో హెచ్‌డిటి గౌరీ శంకర్రావు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

## 'జంపా'కు ఘన నివాళి

ప్రజాశక్తి- మెంటాడ

ఇటీవల మృతి చెందిన జెవివి జాతీయ నాయకులు జంపా కృష్ణ కిషోర్ మృతి పట్ల జెవివి రాష్ట్ర నాయకులు ఘన నివాళులర్పించారు. మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు గండ్రేటి లక్ష్మణరావు పూలమాలవేశి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు రెడ్డి రాజగోపాల్, సిపిఎం పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు, కర్రి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# వంటగదిలోనే వసతి

- వసతి గృహాల్లో విద్యార్థుల అవస్థలు
- ఒకేచోట వంట, వసతి

ప్రజాశక్తి - గజపతినగరం

వసతి గృహాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మండలంలోని బిసి, ఎస్‌సి, ఎస్‌టి బాలుర, బాలికల పాఠశాల, కళాశాల వసతి గృహాలు పగిలిన కిటికీలు, విరిగిన తలుపులతో దర్శనమిస్తున్నాయి. మండల పరిధిలోని 8 వసతి గృహాలలో సుమారు 700 మంది బాలబాలికలు ఆశ్రయం పొందుతున్నారు. వీటిలో నాలుగు కళాశాల వసతి గృహాలు



శిధిలావస్థకు చేరిన వసతి గృహం

పాడుపడిన, ఎప్పుడు కూలిపోతాయో తెలియని అద్దె భవనాల్లో కాలం వెల్లదీస్తున్నాయి. కాలకృత్యాలు తీర్చుకోవడానికి, స్నానాలు చేసుకోవడానికి సరియైన గదులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్న ఒకటి రెండు గదులను వసతి గృహాల పరిసరాలను శుభ్రం చేసేవారు లేక, దుర్గంధం వెదజల్లుతున్నాయి. వెంకటాపురం వద్ద ఉన్న ఎస్‌సి బాయ్స్ కళాశాల హాస్టల్లో విద్యార్థులు ఉండడానికి గదులు లేక వంటగదినే తమ సామాన్లు భద్రపరుచుకుని అందులోనే ఉంటున్నారు. అనారోగ్యం వంటి అత్యవసర పరిస్థితులు వచ్చినప్పుడు స్థానికంగా వార్డెన్‌లు అందుబాటులో ఉండకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇస్తున్న మెస్ ఛార్జీలు సరిపోకపోవడంతో మెనూని సక్రమంగా అమలు చేయలేకపోవడంతో మూడు పూటలా రుచిగల ఆహారం విద్యార్థులకు అందకపోవడం వల్ల ఆకలిని జీర్ణించుకుంటూ ఆహారాన్ని చెత్తబుట్టలో వేయాల్సిన పరిస్థితి నెల కొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వసతి గృహాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.



వంట గదిలోనే ఉంటున్న విద్యార్థులు

# సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం

ప్రజాశక్తి- గరివిడి

సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. చీపురుపల్లి ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో వైఎస్ఆర్ సంపూర్ణ పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి, గరివిడి, గుర్ల ఎంపిపిలు ఇప్పిలి వెంకట నరసమ్మ, మీసాల విజయలక్ష్మి, పొట్నూరు ప్రమీల, చీపురపల్లి, గరివిడి జెడ్‌పిటిసిలు వలిరెడ్డి శిరీష, వాకాడ శ్రీనివాసరావు, అంగన్వాడి సిడిపిఒ కె.రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**శృంగవరపుకోట:** గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అవసరమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, తదితరులు పాల్గొన్నారు.

**మెంటాడ:** మండల కేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, సర్పంచ్ రేగిడ రాంబాబు, ఎంపిటిసి పతివాడ కుమారి, విశ్రాంతి ఉపాధ్యాయుడు ముగుడ లింగేశ్వరరావు, తహశీల్దార్ టి రామకృష్ణ, ఎంపిడిఒ త్రివిక్రమ్ రావు, ఐసిడిఎస్ పిఒ నాగమణి, పాల్గొన్నారు.

**బాడంగి:** పౌష్టికాహారం తీసుకోవడంతోనే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. బాడంగి ఐసిడిఎస్ పరిధిలోని గొల్లాది గ్రామంలో బుధవారం నిర్వహించిన తల్లిపాలు వారోత్సవాలు, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన చేతులు మీదుగా గర్భిణులు, బాలింతలకు



కొత్తవలస: పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోగి గౌరి, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, సర్పంచ్ బేతనపల్లి కిరణ్ కుమారి, జెసిఎస్ కన్వీనర్ మరిపి శంకర్ రావు పాల్గొన్నారు.

**డెంకాడ:** ప్రభుత్వం అందిస్తున్న వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని గర్భిణులు, బాలింతులు, చిన్నారులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మోపాడ గ్రామంలో బుధవారం సంపూర్ణ పోషణ కిట్లను మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు పాల్గొన్నారు.

**వేపాడ :** స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి దొగ్గ సత్యవంతుడు ఆధ్వర్యంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎస్ అప్పలనాయుడు, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, ఎంఇఒ పి. బాల భాస్కర్ రావు, గ్రామ సర్పంచ్, ఎంపిటిసి, ఐసిడిసి సిబంది పాల్గొన్నారు.

**నెల్లిమర్ల:** మండలంలోని గుషిణిలో పౌష్టికాహార, తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేతులు మీదుగా గర్భిణి, బాలింతలకు సంపూర్ణ పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ చనమల్ల వెంకట రమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం నాయుడు, పతివాడ సత్య నారాయణ, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**బొబ్బిలి:** పౌష్టికాహారం తీసుకోవడంతోనే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని బొబ్బిలి మునిసిపల్ చైర్మెన్ సావు వెంకట మురళీ కృష్ణారావు అన్నారు. బొబ్బిలి పట్టణం గొల్లపల్లి 10,11,12 వార్డులలో బుధవారం నిర్వహించిన వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని కిట్లను అందజేశారు..

**రాజాం:** గర్భిణీలు, బాలింతల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన టెక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని మండలంలోని పొగిరి గ్రామంలో బుధవారం ప్రారంభించారు. రాజాం పిఒ కనకదుర్గ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న, పొగిరి సర్పంచ్ కృష్ణవేణి, ఎంపిటిసి మన్మధరావు, పంచాయితీ సెక్రటరీ పద్మజ చేతులు మీదుగా పౌస్టికాహారాన్ని పంపిణీ చేశారు.

**గరివిడి:** గర్భిణులు, బాలింతల్లో, పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు కోరారు. స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ ప్రమీల కుమార్ ఆధ్వర్యంలో బుధవారం టీచర్స్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్ఆర్ పౌష్టికాహార కిట్లును పంపిణీ చేశారు.

**కొత్తవలస:** వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం గర్భిణులకు వరం లాంటిదని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ ఆర్. రూపాదేవి అధ్యక్షతన వైయస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గొపమ్మ, పిఎసిఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చా ఎర్రయ్య రామస్వామి, తుమ్మికాపల్లి సర్పంచ్ కొండలరావు, సహాయక సిడిపిఒ బి. లక్ష్మీబాయి, సూపర్‌వైజర్లు రమణమ్మ, స్వర్ణలత పాల్గొన్నారు.

## 'ఆడుదాం ఆంధ్ర'లో క్రీడలు

**బొండపల్లి :** గ్రామీణ ప్రాంతాలలో అనేక క్రీడలలో నైపుణ్యం ఉన్న క్రీడా రత్నాలను వెలుగు తీసేందుకే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం దోహద పడుతుందని ఎంపిపి చల్ల చలంనాయుడు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పిఈటిలు, పీడీలు, పంచాయతీ సెక్రెటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రలో భాగంగా 17 సంవత్సరాలు నిండిన వారికి సచివాలయ స్థాయిలోనూ, మండల స్థాయిలోనూ ఐదు క్రీడాంశాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. సచివాలయ పరిధిలో ఆసక్తి గల క్రీడాకారులను గుర్తించి తగిన ఆదారాలతో గ్రామ కార్యదర్శులు పేర్లు నమోదు చేయాలన్నారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, ఖోఖో, షటిల్ వంటి ఆటలకు సంబంధించి క్రీడాకారులను ఎంపిక చేయా లన్నారు. ఎంపిడిఒ వై.బి.రాజేంద్రప్రసాద్, ఇఒపిఆర్‌డి సిహెచ్ సుగుణాకర్ రావు, ఎంఇఒ శోభారాణి, ఎంఇఒ-2 అల్లు వెంకరమణ, గేమ్స్ సెక్రెటరీ లెంక వెంకటరమణ పాల్గొన్నారు.

## గడపగడపకూ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని గాజులరేగ ఆచంట కాలనీ నుండి జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన తీరు పట్ల ప్రజల స్పందనను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ లయాయాదవ్, డివిజన్ ఇన్‌ఛార్జి కణుగుల రాజా, నడిపిల్లి ఆదినారాయణ,పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

శంకుస్థాపనల మాసోత్సవాలలో భాగంగా బుధవారం 43వ డివిజన్ పాల్ నగర్ 1వ లైన్‌లో వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపనలు చేశారు. రూ.36.30లక్షలతో రహదారులు, కాలువల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జి డాక్టర్ వియస్ ప్రసాద్, స్థానిక కార్పొరేటర్ దాసరి సత్యవతి, మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ వింత ప్రభాకర్ రెడ్డి, వైసిపి నాయకులు వెంకీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## 4న మేళా

ప్రజాశక్తి- విజయనగరం కోట

ఈనెల 4న సెర్వో డ్రైవ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించే అప్రెంటీస్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి తెలిపారు. బుధవారం స్థానిక ఐటిఐ కళాశాలలో ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన స్థానిక ప్రభుత్వ ఐటిఐ విజయనగరంలో మేధో సర్వో డ్రైవ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రముఖ కంపెనీలో అప్రెంటిస్ మేళా నిర్వహిస్తుందన్నారు. అభ్యర్థులు అప్రెంటీస్ రిజిస్ట్రేషన్ ఫారంతో పాటు టెన్త్ మార్కులు జాబితా, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధారుకార్డుతో హాజరు కావాలన్నారు. వివరాలకు 9849944654, 8985054780కు సంప్రదించాలని తెలిపారు.

## 'విద్యుత్తు శాఖ నిర్లక్ష్యంతోనే ప్రమాదం'

ప్రజాశక్తి- బొబ్బిలి

విద్యుత్ శాఖాధికారులు నిర్లక్ష్యంతోనే బాడంగి మండలం పూడివలసలో విద్యుత్ ప్రమాదం జరిగి ఇద్దరు ఉపాధి కూలీలు మరణించి మరొక ఉపాధి కూలీ గాయపడ్డాడని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పూడివలస పొలాల్లో సాగునీటి కాలువలో పూడికలు, పిచ్చిమొక్కలు తొలగిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు కూలీలు మరణించగా మరో కూలీ గాయపడ్డారన్నారు. విద్యుత్ శాఖాధికారులు నిర్లక్ష్యం వల్లే ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వినియోగదారుల నుంచి అధిక మొత్తంలో విద్యుత్ చార్జీలు వసూలు చేస్తున్న అధికారులు ఇద్దరు కూలీలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా మరణిస్తే నష్టపరిహారం ఇవ్వకుండా తప్పించుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. విద్యుత్ ప్రమాదానికి రైతే కారణమని చెప్పడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. తప్పుడు పద్ధతిలో రైతు వైర్ తీసుకు వెళ్తే అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. విద్యుత్ శాఖాధికారులు సహకారం లేకుండా రైతు విద్యుత్ లాగే అవకాశం ఉందా అని విద్యుత్ శాఖాధికారులను ప్రశ్నించారు. విద్యుత్ షాక్‌తో మరణించిన ఇద్దరు ఉపాధి కూలీలకు రూ.50లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, గాయపడిన కూలీకు నాణ్యమైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంపై విద్యుత్ శాఖపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతేడాది విద్యుత్ షాక్‌తో ఆవు, దూడ మరణిస్తే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. వినియోగంలో విద్యుత్ లేకపోతే విద్యుత్ సరఫరా ఎందుకు నిలిపివేయలేదని ప్రశ్నించారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయకపోతే ప్రైవేట్ కేసు వేసి కోర్టులో న్యాయ పోరాటం చేస్తామన్నారు.

**బాడంగి:** సక్రమంగా పర్యవేక్షణ చేయకుండా ఉపాధి పనులు పెట్టిన ఉపాధి హామీ సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేయాలని సిపిఎం నాయకుల ఎ.సురేష్ డిమాండ్ చేశారు. మండలంలోని పూడి వలస ఉపాధి కూలీలు నిన్న సాయంత్రం ఉపాధి పనులకు వెళ్లి విద్యుత్ తీగలకు తగిలి మరణించడం చాలా బాధాకరమన్నారు. వేసవికాలంలో ఉపాధి పనులు పెట్టడం మానేసి వర్షాలు పడుతున్న సమయంలో ఉపాధి పనులు పెట్టడం వల్ల ఇటువంటి మరణాలు ఇంకెన్ని చూడాలి అని ఆయన అన్నారు. ఇద్దరు రైతులు చావుకు కారణం ఉపాధి హామీ సిబ్బంది, అధికారులేనని చెప్పారు. బాధితుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నాం

**గులివిందల పేటకు తాగునీరు, రహదారి**

**పతివాడ ఎంపిటిసి అప్పలనాయుడు**

ప్రజాశక్తి- పూసపాటిరేగ

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని పతివాడ ఎంపిటిసి, వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పతివాడ పంచాయతీ పరిధిలోని గులివిందల పేటలో స్థానికులతో సమావేశమయ్యారు. ఇటీవల పతివాడలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో గులివిందల పేటకు చెందిన మహిళలు తమ గ్రామానికి రహదారి సౌకర్యంతో పాటు తాగునీరు కావాల్సి ఉందని కోరారు. గ్రామానికి వచ్చి సమస్యలు పరిష్కరిస్తానని సమావేశంలో ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు బుధవారం ఆయన వారు దగ్గరికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు తాగునీరు బోరు ఉన్నప్పటికీ బురద నీరు వచ్చేస్తున్నాయని, గ్రామంలోకి రావడానికి సిసి రహదారి కావాలని, పొలాల్లోకి వెళ్ళడానికి గ్రావెల్ రహదారి కావాలని కోరారు. వెంటనే ఆయన స్పందించి నెల రోజుల్లోపు రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు గ్రావెల్ రోడ్డుతో పాటు తాగునీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న చేతిపంపు సమస్య ఈరోజే పరిష్కరిస్తానని, వెంటనే బోర్ మెకానికులకు ఫోన్ చేసి బోర్ రిపేరు వెంటనే చేయాలని ఆదేశించారు. గ్రామంలోకి వెళ్లేందుకు సీసీ రహదారి కూడా ప్రస్తుతం 100 మీటర్ల



గ్రామస్తులతో మాట్లాడుతున్న పతివాడ అప్పలనాయుడు

వరకూ నిర్మాణం చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. మీ ప్రాంతంలో ఈ సమస్య ఉందని తనకు ఇంతవరకు ఎవరూ చెప్పలేదని ఆయన అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో మీరు అడిగిన తర్వాతే మీ సమస్య తనకు తెలిసినట్లు చెప్పారు. అందుకే ప్రత్యేకంగా మీ గ్రామానికి వచ్చానని ఆయన తెలిపారు. ఆయనతోపాటు పతివాడ వైసిపి నాయకులు పిన్నింటి నారాయణరావు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సత్యనారాయణ, గుంపాం వైసిపి నాయకులు యడ్ల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## టిడిపి 'మహాశక్తి'తో మహిళల అభివృద్ధి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

టిడిపి మహాశక్తితో మహిళల అభివృద్ధి జరుగుతుందని టిడిపి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి అన్నారు. మంగళ వారం నగర పంచాయతి పరిధి జరజాపుపేటలో మహాశక్తి చైతన్య రథయాత్ర బుధవారం ప్రారంభమైంది. నియోజకవర్గ స్థాయిలో ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో టిడిపి పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి మహిళా నేతలు, కార్యకర్తలతో జరజాపుపేట వార్డుల్లో పర్యటించి మహిళల కోసం చంద్రబాబు ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో మహాశక్తి పై ఇంటింటా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వనజాక్షి మాట్లాడుతూ టిడిపి మేనిఫెస్టోలో ప్రవేశ పెట్టిన 'మహాశక్తి' మహిళల భవిష్యత్ గ్యారంటీ ఉంటుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మహిళలంతా సంఘటితంగా పని చేసి టిడిపిని అధికారంలోకి తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూసపాటిరేగ, డెంకాడ మాజీ ఎంపిపిలు మహంతి చిన్నం నాయుడు, కంది చంద్ర శేఖర్ రావు, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, డెంకాడ మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పల నారాయణ, పార్ల మెంట్ కార్యదర్శి లెంక అప్పల నాయుడు, నగర పంచాయతి పార్టీ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, టిడిపి పట్టణకార్యదర్శి అవనాపు సత్య నారాయణ, నియోజక వర్గం మహిళా అధ్యక్షురాలు చిల్ల పద్మ, రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యదర్శి చీకటి సుహాసిని, కళావతి, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎన్‌పిఎం రిసోర్స్ పర్సన్ వి. లక్ష్మి అన్నారు. బుధవారం మెట్టవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరినాట్లు వేయడంపై ఆమె రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వరి నారుకు బీజామృతంతో నారు శుద్ధి చేసేందుకు కొసలు తుంచి నాట్లు వేయడం, లైన్ వారీగా నాట్లు వేయాలని తెలిపారు. ఇలా చేయడం వల్ల నారు నుండి సంక్రామించే తెగుళ్ళు, కాండం తొలుచు పురుగు గుడ్ల నశించి



రైతులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మి

చేను ఆరోగ్యంగా ఎదుగుతుందన్నారు. కొసలు తుంచేయడం వల్ల చీడ పీడలు అరికట్టుకోవచ్చన్నారు. లైన్ వారీగా నాట్లు వేయడం వల్ల దోమ పోటును కంట్రోల్ చేసుకోవచ్చన్నారు. రైతులు పాల్గొన్నారు.

## శత శాతం ఓటరు సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతిలో జరుగుతున్న ఓటరు సర్వే శత శాతం పూర్తి చేయాలని కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో నగర పంచాయతీ పరిధి బూత్ లెవెల్ ఆఫీసర్లుతో కమిషనరు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఎల్‌ఒలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల సర్వేను త్వరితగతిన 100 పూర్తి చేయాలన్నారు. ఓటు హక్కు లేని వారికి కొత్త ఓటు నమోదు చేయడానికి దరఖాస్తులు సేకరించి, మరణించిన ఓటర్లును గుర్తించి మరణ ధృవీకరణ పత్రాలను సేకరించిన ఓటర్ల జాబితా నుండి తొలగించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మేనేజర్ టివిఎస్ విశ్వేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకు తనిఖీ

**మెరకముడిదాం:** పెట్రోల్ బంకు యజమానులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇంచార్జి తహశీల్దార్ పిన్నింటి రామారావు అన్నారు. బుధవారం మండలంలోని శ్రీ పద్మరాజ్ ఏజన్సీ (పెట్రోల్ బంక్ )ను ఆన్లైన్ యాప్ ద్వారా తనిఖీ చేసి ఆయిల్ పరిశీలించి ఏ విధమైన కల్తీ లేకపోవటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంక్ యాజమాన్యం ప్రభుత్వం, ఉన్నతధికారులు సూచన మేరకు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

## బాధితులను పర్యవేక్షించాలి

ప్రజాశక్తి- బొండపల్లి

బొండపల్లిలో కుక్క కాటుకు గురైన పదమూడు మంది బాదితులను అవసరమైన చికత్స కోసం పర్యవేక్షించాలని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కేఎ. నాయుడు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక పి.హెచ్.సిలో వైద్యాధికారి కే.సత్యనారాయణను ఆయన కలుసుకొని కుక్క కాటు బాధితులకు అందించిన వైద్య సహాయంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెఎ. నాయుడు మాట్లాడుతూ కుక్క కాటు భాదితుల ఇండ్లకు వైద్య సిబ్బంది వెళ్లి పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారిని కోరారు. ఈయన వెంట టిడిపి నాయకులు బండారు బాలాజీ, వెలమ సాధికార సంస్థ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అల్లు విజయ్ కుమార్, మాసారపు పోలినాయుడు, గంట్యాడ మండల పార్టీ అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ రావు, జంపన రవిబాబు ఉన్నారు.

## 5న న్యాయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక రాజా కళాశాలలో ఈనెల 5న న్యాయ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ చెప్పారు. ర్యాగింగ్, మత్తు పదార్థాలు వల్ల అనర్థాలు, ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పిస్తామని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులు సదస్సుకు హాజరు కవాలని ఆయన కోరారు. మధ్యాహ్నం 3.30గంటలకు సదస్సు ప్రారంభం అవుతుందని, ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## నేరాలు ఘోరాలు

### మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

**గంట్యాడ:** మండలంలోని గింజేరు గ్రామానికి చెందిన వెల్దుర్తి బంగారి (57) మనస్థాపం చెంది బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బంగారి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని తమ కుమార్తెకు ఈనెల 24వ తేదీన పెళ్లి నిత్యమైంది. పెళ్లికి సంబంధించిన డబ్బులు కుదరకపోవడంతో మనస్థాపం చెంది కల్లంలోని తువ్వాలతో ఉరివేసుకొని మృతి చెందాడు. గంట్యాడ ఎఎస్ఐ రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

### ఆటోను ఢీకొన్న వ్యాను

**రామభద్రపురం:** మండలంలో రొంపల్లి జంక్షన్ వద్ద ఆటోను వెనుక నుంచి కోళ్ల రవాణా చేసే వ్యాను ఢీ కొట్టడంతో పలువురు గాయపడినట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రామభద్ర పురం నుంచి బొబ్బిలి వెళుతున్న ఆటోను అదే మార్గంలో వెళుతున్న వ్యాను వెనుక నుంచి ఢీ కొట్టడంతో ఆటోలో ప్రయాణం చేస్తున్న అల్లాడ ఎల్లమ్మ, ఉషారాణీ, సన్యాసమ్మ, చిన్నమ్మ, వెంకటరమణలు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.